బైడెన్ శ్రీమతికి మోదీ ఖరీదైన బహుమతి!

వాషింగ్టన్, జనవరి 3: ప్రధాని నరేంద్ర మోదీ 2023లో అమెరికాను సందర్శించిన సందర్భంగా ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్ సతీమణికి అందజేసిన బహుమతులలో అత్యంత ఖరీదైన వజ్రం అందరి దృష్టిని ఆకట్టుకుంది. 7.5 క్యారట్ సింథటిక్ వజ్రాన్ని ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుని సతీమణి జిల్ బైడెన్‌కు అందజేశారు. దీని ఖరీదు దాదాపు రూ.17.15 లక్షలు ఉంటుంది. 2023 సంవత్సరంలో అమెరికా అధ్యక్షుని కుటుంబం అందుకున్న బహుమతులలో ఇదే అత్యంత ఖరీదైనదని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. 2023లో బైడెన్ దంపతులకు పలువురు విదేశీ నాయకులు లక్షలాది రూపాయలు విలువచేసే బహుమతులను అందజేశారు. అయితే ఈ బహుమతులను బైడెన్ దంపతులు వ్యక్తిగతంగా ఉపయోగించుకునే అవకాశం లేదు. ఇవన్నీ వైట్ హౌస్‌కే చెందుతాయి. జనవరి 20న డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బైడెన్ దంపతులు ఈ వజ్రంతోపాటు ఇతర ఖరీదైన బహుమానాలను జాతీయ పురావస్తు శాఖకు అప్పగించాల్సి ఉంటుంది. అయితే అధ్యక్షుని భార్యకు ఆ వజ్రాన్ని కొనుగోలు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది.

థాయ్‌లాండ్ ప్రధాని ఆస్తులు 3 వేల కోట్లు

బ్యాంకాక్, జనవరి 3: థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్ర తనకు భారీ ఆస్తులున్నట్టు శుక్రవారం ప్రకటించారని ఆమె పార్టీ వర్గాలు తెలిపాయి. ఆమె దగ్గర రూ.17 కోట్ల విలువైన 200 డిజైనర్ బ్యాగులు, రూ.42 కోట్ల విలువైన 75 లేటెస్ట్ లగ్జరీ వాచ్‌లు ఉన్నాయని స్థానిక మీడియా తెలిపింది. జాతీయ అవినీతి వ్యతిరేక కమిషన్‌కు ఆమె ఈ వివరాలు సమర్పించారు. తనకు మొత్తం రూ.3,430 కోట్లకు పైగా ఆస్తులున్నట్టు షినవత్ర తెలిపారు. టెలికం బిలియనీర్, థాయ్ మాజీ ప్రధాని థక్సిన్ షినవత్ర చిన్న కూతురైన పేటోంగ్టార్న్ గతేడాది సెప్టెంబర్‌లో ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. తనకు 11 బిలియన్ బాత్(థాయ్ కరెన్సీ) పెట్టుబడులు ఉన్నాయని ఆమె తెలిపారు. తనకు సుమారు అయిదు బిలియన్ బాత్‌ల అప్పులున్నట్టు కూడా ఆమె ప్రకటించారు. థక్సిన్ కుటుంబం షిన్ కార్ప్ టెలికమ్యూనికేషన్ కంపెనీతో వ్యాపారంలో బాగా లాభాలు గడించింది. ఆ తర్వాత ఆయన కుటుంబం రాజకీయాల్లోకి వచ్చింది. పేటోంగ్టార్న్ తన కుటుంబం నుంచి థాయ్ ప్రధానిగా ఎన్నికైన నాలుగో వ్యక్తి.

రోజుకు 43 కోట్లు వేతనం!

న్యూఢిల్లీ, జనవరి 3: క్వాంటం స్కేప్ వ్యవస్థాపకుడు, మాజీ సీఈవో జగ్దీప్‌సింగ్ ప్రపంచంలోనే అత్యధిక వేతనం పొందుతున్న వ్యక్తిగా వార్తల్లోకెక్కారు. అసాధారణ రీతిలో ఆయన ఏడాది కాలానికి రూ.17,500 కోట్లు ఆర్జించారు. అనగా రోజుకు రూ.43 కోట్ల చొప్పున అందుకున్నారు. ప్రపంచంలోని అనేక పేరొందిన కార్పొరేట్ సంస్థలు సైతం ఈ స్థాయిలో వార్షిక ఆదాయాన్ని పొందడం లేదు. ఎలక్ట్రిక్ వాహనాలలో ఉపయోగించే బ్యాటరీల సాంకేతిక పరిజ్ఞానంలో సాధించిన నైపుణ్యం నేపథ్యంలో ఆయన ప్రఖ్యాతిగాంచారు. ఆ పరిజ్ఞానంతోనే 2010లో క్వాంటం స్కేప్‌ను స్థాపించారు. ఈ కంపెనీ రేపటితరం బ్యాటరీలను ఉత్పత్తి చేస్తున్నది. ఈ బ్యాటరీలలో ఇంధన సామర్థ్యం, తక్కువ సమయంలో చార్జింగ్ అనే ప్రత్యేకతలు పలు అగ్రశ్రేణి కార్ల తయారీ కంపెనీలను ఆకర్షించాయి. ఫోక్స్‌వాగన్, బిల్‌గేట్స్ వంటి దిగ్గజాలు క్వాంటం స్కేప్‌లో పెట్టుబడులు పెట్టారు. గత ఏడాది ఫిబ్రవరి 16న సీఈవోగా రాజీనామా చేసిన జగ్దీప్ సింగ్ ఆ బాధ్యతలను శివశివరాంకు అప్పగించారు.

ఎయిర్‌ట్యాగ్‌లతో చిన్నారులకు ముప్పు

దూరంగా ఉంచాలంటూ యాపిల్ హెచ్చరికలు

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం 'యాపిల్' తయారు చేస్తున్న గొప్ప ఉత్పత్తుల్లో ఎయిర్‌ట్యాగ్ ఒకటి. ఇండ్లలోనో లేక ఇంకెక్కడైనా పెట్టి మర్చిపోయిన వస్తువులను గుర్తించేందుకు ఉపయోగపడే ఈ ట్రాకింగ్ డివైజ్‌ను ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ఉపయోగిస్తున్నారు. కానీ, దీని వల్ల చిన్నపిల్లలకు తీవ్రమైన ముప్పు పొంచి ఉన్నదట. ఈ నేపథ్యంలో ఎయిర్‌ట్యాగ్‌లను చిన్నపిల్లలకు దూరంగా ఉంచాలని 'యాపిల్' సూచిస్తున్నది. ఎయిర్‌ట్యాగ్‌లో ఉండే కాయిన్-సెల్ బ్యాటరీని మింగితే తీవ్ర ముప్పు లేదా ప్రాణహాని ప్రమాదం ఉన్నదని తల్లిదండ్రులను హెచ్చరిస్తున్నది. ఈ మేరకు ఆ కంపెనీ ఎయిర్‌ట్యాగ్‌లతోపాటు వాటి ప్యాకెట్లపైన, బ్యాటరీ కంపార్ట్‌మెంట్‌లో వార్నింగ్ సింబల్స్ పెట్టినట్టు అమెరికా కన్స్యూమర్ ప్రొడక్ట్ సేఫ్టీ కమిషన్ వెల్లడించింది.

రైలు పట్టాలపై పబ్‌జీ.. ముగ్గురి మృతి

పాట్నా: రైలు పట్టాలపై కూర్చొని పబ్‌జీ ఆడుతుండగా, రైలు ఢీకొనడంతో ముగ్గురు టీనేజర్లు ప్రాణాలు కోల్పోయారు. బీహార్‌లోని పశ్చిమ చంపారన్ జిల్లాలో గురువారం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం, ముగ్గురు టీనేజర్లు పుర్కాన్ ఆలం, సమీర్ ఆలం, హబీబుల్లా అన్సారీ చెవులలో ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని, రైల్వే ట్రాక్‌పై పబ్‌జీ గేమ్ ఆడుతున్నారు. అదే సమయంలో ఓ రైలు వేగంగా వచ్చింది. రైలు శబ్దాన్ని వీరు వినలేకపోయారు. వేగంగా వచ్చిన రైలు వీరిని ఢీకొట్టడంతో ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు.

అది సాగు చట్టాల కన్నా ప్రమాదకరం

అగ్రి మార్కెటింగ్ పాలసీపై ఎస్‌కేఎం ఆగ్రహం

చండీగఢ్ : వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన నిబంధనావళి (ఎన్‌పీఎఫ్‌ఏఎం) ముసాయిదా.. గతంలో రద్దయిన 3 సాగు చట్టాల కన్నా ప్రమాదకరమైనదని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆరోపించింది. దీనిని అమలు చేస్తే, సమాఖ్య హక్కులను రాష్ట్ర ప్రభుత్వాలు కోల్పోతాయని తెలిపింది. వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ), రైతులు, కూలీలకు కనీస వేతనాలకు సంబంధించిన నిబంధనలు దీనిలో లేవని, అందువల్ల రైతులు, వ్యవసాయ కూలీలు, చిన్న ఉత్పత్తిదారులు, చిన్న తరహా వ్యాపారుల ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని హెచ్చరించింది.

చైనా కొత్త కౌంటీల ఏర్పాటుపై భారత్ నిరసన

న్యూఢిల్లీ: లద్దాఖ్ నుంచి ఆక్రమించిన అక్సాయ్ చిన్ ప్రాంతాన్ని రెండు కొత్త కౌంటీలుగా ఏర్పాటు చేస్తూ చైనా తీసుకున్న నిర్ణయంపై భారత్ నిరసన తెలిపింది. ఈ విషయమై శుక్రవారం విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ.. 'చైనా రెండు కొత్త కౌంటీలను ఏర్పాటు చేస్తూ చేసిన ప్రకటనను చూశాం. ఈ కౌంటీల్లో కొన్ని భాగాలు లద్దాఖ్‌లో ఉన్నాయి. భారత భూభాగాన్ని ఆక్రమించిన చైనా తీరును ఎన్న డూ అంగీకరించలేదు. భారతదేశ సార్వభౌమాధికారంపై మా దీర్ఘకాలిక, స్థిరమైన వైఖరిపై కొత్త కౌంటీల ఏర్పాటు నిర్ణయం ప్రభావం చూపించదు' అని పేర్కొన్నారు.

మెడికల్ సీట్లను ఖాళీగా ఉంచొద్దు

కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: మెడికల్ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉండకూడదని సుప్రీంకోర్టు శుక్రవారం చెప్పింది. సమస్య పరిష్కారానికి సంబంధిత వర్గాలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను తీసుకోవాలని, ఇదే అంశంపై గతంలో ఏర్పాటు చేసిన కమిటీ ఇచ్చిన సిఫారసులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని తెలిపింది. సూపర్ స్పెషాలిటీ మెడికల్ కోర్సుల్లోని సీట్లు కూడా ఖాళీగా ఉంటుండటాన్ని సుప్రీంకోర్టు 2023 ఏప్రిల్‌లో గుర్తించింది.

చైనాలో హెచ్ఎంపీవీ కలకలం

- పొరుగుదేశంలో వేగంగా వ్యాపిస్తున్న వైరస్
- పెరుగుతున్న కేసులు.. నిండుతున్న దవాఖానలు
- కొవిడ్-19 తర్వాత మరో ఆరోగ్య సంక్షోభం?
- వైరస్ లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..

న్యూఢిల్లీ, జనవరి 3: చైనాలో మరో వైరస్ విజృంభిస్తున్నది. హ్యూమన్ మెటాన్యూమోవైరస్(హెచ్ఎంపీవీ) కేసులు పెరుగుతున్నాయి. బాధితులతో దవాఖానలు కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా చైనాలోని 14 ఉత్తర ప్రావిన్సుల్లో వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉంది. దీంతో కొవిడ్-19 తర్వాత హెచ్ఎంపీవీ రూపంలో మరో ఆరోగ్య సంక్షోభం మొదలవబోతున్నదా అనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

హెచ్ఎంపీవీ వైరస్ అంటే?

హ్యూమన్ మెటాన్యూమోవైరస్‌ను(హెచ్ఎంపీవీ) మొదట 2001లో గుర్తించారు. 2011-12లో అమెరికా, కెనడా, ఐరోపా ఈ వైరస్ కేసులు నమోదయ్యాయి.

లక్షణాలు ఏంటి?

హెచ్ఎంపీవీ వైరస్ సోకితే సాధారణంగా దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్నవారిలో బ్రాంకైటిస్, నిమోనియా వంటి సమస్యలకు సైతం దారి తీయొచ్చు. సాధారణంగా వైరస్ సోకిన మూడు నుంచి ఆరు రోజుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి.

ఎలా సోకుతుంది?

- దగ్గు, తుమ్ముల నుంచి వచ్చే తుప్పిర్లు ద్వారా వైరస్ వ్యాపిస్తుంది.
- వైరస్ సోకిన వారికి షేక్‌హ్యాండ్ ఇచ్చినా, తాకినా వైరస్ సోకవచ్చు.
- వైరస్‌తో కలుషితమైన వస్తువులను తాకి, అవే చేతులతో ముక్కు, మూతి, కళ్లను తాకినా వైరస్ సోకుతుంది.

ఎక్కువ ముప్పు ఎవరికి?

- పిల్లలు, వయోధికులు, రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్న వారికి



హెచ్ఎంపీవీ ముప్పు అధికం.

హెచ్ఎంపీవీ ఎలా నివారించాలి?

- తరచూ సబ్బుతో కనీసం 20 సెకన్ల పాటు చేతులను శుభ్రం చేసుకోవాలి.
- శుభ్రం చేసుకోని చేతులతో ముఖాన్ని ముట్టుకోవద్దు.
- అనారోగ్య లక్షణాలతో ఉన్న వారికి కొంచెం దూరంగా మసులుకోవాలి.
- తరచూ ముట్టుకునే వస్తువులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.

లక్షణాలు ఉన్నవారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

- దగ్గేటప్పుడు, తుమ్మేటప్పుడు ముక్కు, నోరుకు టిష్యూ లేదా కర్చీఫ్‌ను అడ్డుపెట్టుకోవాలి.
- తరచూ కనీసం 20 సెకన్ల పాటు సబ్బు, నీటితో శుభ్రం చేసుకోవాలి.
- వ్యక్తిగత వస్తువులు ఇతరులు వినియోగించడానికి ఇవ్వొద్దు.
- అనారోగ్యంగా ఉంటే ఇంటికే పరిమితం అవడం మంచిది.

హెచ్ఎంపీవీకి వ్యాక్సిన్ ఉందా?

హెచ్ఎంపీవీ నివారణకు వ్యాక్సిన్ లేదు. వ్యాధి లక్షణాలను తగ్గించేందుకు, మరిన్ని సమస్యలు తలెత్తకుండా నివారణగా మాత్రమే వైద్య చికిత్సను అందిస్తున్నారు.

అప్రమత్తమైన భారత్

చైనాలో హెచ్ఎంపీవీ వ్యాప్తి తీవ్రమవడంతో భారత్ అప్రమత్తమైంది. దేశంలో నమోదవుతున్న సీజనల్ వ్యాధులు, శ్వాస కోశ వ్యాధులకు సంబంధించిన కేసులను కేంద్ర ఆరోగ్య శాఖ పర్యవేక్షిస్తున్నది.

శీతాకాలంలో సహజమే: చైనా

హెచ్ఎంపీవీ వైరస్ కేసులపై చైనా స్పందించింది. శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధులు పెరగడం సహజమేనని, గతేడాదితో పోల్చితే ఈసారి కేసులు తక్కువగానే ఉన్నాయని శుక్రవారం ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ తెలిపారు. ప్రజల ఆరోగ్యంపై తమ ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటుందని, చైనాలో ప్రయాణించడం సురక్షితమని ఆమె పేర్కొన్నారు.

ఆస్తి హక్కు.. రాజ్యాంగ హక్కు

- తగిన పరిహారం చెల్లించకుండా వ్యక్తుల భూమిని లాక్కోలేరు
- పరిహారంలో జాప్యం జరిగితే బాధితులు ఎందుకు నష్టపోవాలి?
- ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారమే మొత్తం పరిహారాన్ని చెల్లించాలి
- భూసేకరణ కేసులో సుప్రీంకోర్టు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ఆస్తిహక్కు.. రాజ్యాంగబద్ధమేనని, అది పౌరులకు కల్పించిన మానవ హక్కుల్లో భాగమేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. భూ పరిహారాన్ని చెల్లించడంలో ప్రభుత్వాలు చేసే జాప్యంతో భూమిచ్చిన రైతులు, ఇండ్లను కోల్పోయిన యజమానులు ఎందుకు నష్టపోవాలని ప్రశ్నించింది. భూ పరిహారం ఎప్పుడైతే చెల్లిస్తారో అప్పటి మార్కెట్ రేటునే అనుసరించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం కీలక తీర్పు వెలువరించింది.

ఏమిటీ కేసు?

కర్ణాటకలో బెంగళూరు-మైసూరు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ (బీఎంఐసీ) ప్రాజెక్టును అప్పటి ప్రభుత్వం తలపెట్టింది. దీనికోసం 2003లో కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియాస్ డెవలప్‌మెంట్ బోర్డు (కేఐఏడీబీ) భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసింది. 2005లో 20 వేలకు పైగా ఎకరాలను సేకరించింది. అయితే భూములిచ్చిన రైతులకు, ఇండ్లను కోల్పోయిన యజమానులకు పరిహారం ఇవ్వడంలో జాప్యం చేసింది. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించారు. బాధితులకు పరిహారం ఇవ్వాల్సిందేనని స్పెషల్ ల్యాండ్ అక్విజిషన్ ఆఫీసర్ (ఎస్ఎల్ఏవో)కు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ, పరిహారం చెల్లింపుల్లో ముందడుగు పడలేదు. దీంతో కోర్టు ధిక్కరణ నోటీసులు అందుకోవడంతో ఎట్టకేలకు 2019 ఏప్రిల్‌లో పరిహారం ఇవ్వడానికి ఎస్ఎల్ఏవో సిద్ధమయ్యారు. అయితే, భూ సేకరణకు నోటిఫికేషన్ జారీచేసిన 2003లో ఉన్న మార్కెట్ రేటు ప్రకారమే పరిహారం ఇస్తామని మెలిక పెట్టారు. దీంతో భూమిని కోల్పోయిన రైతులు, యజమానులు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- ఆస్తి హక్కు రాజ్యాంగ హక్కు.
- 44వ రాజ్యాంగ సవరణ చట్టం-1978 ప్రకారం.. ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించడం నిజమే. అయితే, సంక్షేమ రాజ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 300ఏ ప్రకారం.. ఆస్తి హక్కు అనేది మానవ హక్కుల్లో భాగమేనని గుర్తించాలి.
- చట్టప్రకారం తగిన నష్టపరిహారం చెల్లించకుండా ఒకరి ఆస్తిని లాక్కోలేము.
- ఈ కేసులో, 2005లో బాధితుల నుంచి భూమిని సేకరించిన ప్రభుత్వం తగిన పరిహారాన్ని మాత్రం చెల్లించలేదు. గడిచిన 22 ఏండ్లుగా బాధితులు పరిహారం కోసం పోరాడుతూనే ఉన్నారు.
- ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్లే బాధితులకు తగిన పరిహారం అందలేదు.
- కోర్టు ధిక్కార నోటీసులు ఇచ్చిన తర్వాతే 2019లో పరిహారంపై నిర్ణయానికి వచ్చారు. అయితే, 2003లో నోటిఫికేషన్ ఇచ్చినందుకు గానూ, అప్పటి మార్కెట్ రేటు ప్రకారమే పరిహారాన్ని కట్టి ఇస్తామంటున్నారు.
- 2003 నాటి మార్కెట్ విలువ ప్రకారం.. ఇప్పుడు బాధితులకు పరిహారాన్ని ఇవ్వడానికి మేము అనుమతిస్తే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 300ఏ నిబంధనలను, న్యాయాన్ని అపహాస్యం చేసినట్లే. బాధితులకు మేం నష్టం చేసినవాళ్లమవుతాం.
- ప్రభుత్వాలు చేసిన జాప్యానికి బాధితులు ఎందుకు నష్టపోవాలి?
- సంపద విలువను అది ఇచ్చే రాబడి ఆధారంగా లెక్కించాలి. ద్రవ్యోల్బణం కారణంగా రూపాయి విలువ పతనం అవుతూ వస్తున్నది. 2003 ధరలను బట్టి మీరు పరిహారం ఇస్తే, బాధితులు ఆ వచ్చే డబ్బుతో 2025లో ఎలా తమ అవసరాలను తీర్చుకోగలరు?
- 2019లో ఉన్న మార్కెట్ రేటు ప్రకారమే బాధితులకు ప్రభుత్వం పరిహారాన్ని చెల్లించాలి. ఆర్టికల్ 142 ప్రకారం ఈ కోర్టు ఈ ఆదేశాలు ఇస్తున్నది.
- రెండు నెలల్లోగా పరిహారంపై సంబంధిత అధికారి ఉత్తర్వులు జారీ చేయాలి. అలా జరుగని పక్షంలో బాధితులు న్యాయం కోసం మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చు.

ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహిళ పై డీఎస్పీ లైంగిక వేధింపులు

డీఎస్పీ కార్యాలయ రెస్ట్ రూమ్‌లోనే ఘటన

బెంగళూరు: భూవివాదంలో ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహిళపై కర్ణాటకలో ఓ డీఎస్పీ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. డీఎస్పీ కార్యాలయంలోనే జరిగిన ఈ దారుణానికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. తుమకూరు జిల్లా పావగడకు చెందిన ఓ మహిళ భూవివాదంపై ఫిర్యాదు చేయడానికి మధుగిరి డీఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. ఆమెపై కార్యాలయ రెస్ట్‌రూమ్‌లోనే డీఎస్పీ రామచంద్రప్ప లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. తుమకూరు కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర సొంత జిల్లా కావడం మరింత విమర్శలకు తావిచ్చింది. ఈ ఘటన తర్వాత డీఎస్పీ పరారీలో ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ ఘటనపై పోలీసు శాఖ ఇంకా స్పందించలేదు.

ఎదురుకాల్పుల్లో ముగ్గురు నక్సల్స్ మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని సోర్నమాల్ అడవుల్లో ఘటన

కొత్తగూడెం క్రైం, జనవరి 3: భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గరియాబంద్ జిల్లా సోర్నమాల్ అడవుల్లో శుక్రవారం చోటు చేసుకుంది. సోర్నమాల్ అడవుల్లో ఒడిశా రాష్ట్రం నవపాడ జిల్లా నుంచి స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ), ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి సీఆర్‌పీఎఫ్ బలగాల సంయుక్త ఆధ్వర్యంలో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో భద్రతా దళాలు, మావోయిస్టులు ఒకరికొకరు ఎదురుపడటంతో ఎదురు కాల్పులకు దిగారు. నాలుగు వైపుల నుంచి సుమారు 300 మంది జవాన్ల తాకిడి పెరగడంతో వారి ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గంలోకి పారిపోయారు. ఘటనా స్థలం నుంచి ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన తుపాకులు, ఇతర మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఘటన అనంతరం ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో అడవులను భద్రతా దళాలు జల్లెడ పడుతున్నాయి.

పీసీసీ పీఠం నుంచి డీకే అవుట్?

- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పావులు
- పార్టీలో, ప్రభుత్వంలో ప్రాభవాన్ని తగ్గించేందుకు వ్యూహం
- తన వర్గం మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం విందు
- డీకే శివకుమార్ విదేశాల్లో ఉండగా కీలక సమావేశం
- ప్రభుత్వం పడిపోవడం ఖాయం: బీజేపీ ఎంపీ

బెంగళూరు, జనవరి 3: కర్ణాటక కాంగ్రెస్‌లో మళ్లీ కుమ్ములాటలు ముదిరాయి. న్యూ ఇయర్ వేడుకల పేరుతో కాంగ్రెస్ నేతలు విందు రాజకీయాలకు తెరలేపారు. ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు చెక్ పెట్టే దిశగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వర్గం వేగంగా పావులు కదుపుతున్నది. పార్టీలో, ప్రభుత్వంలో డీకే ప్రాభవాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నది. డీకే శివకుమార్ విదేశాల్లో ఉండగా ఈ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్టు కనిపిస్తున్నది. డీకే శివకుమార్‌ను పీసీసీ అధ్యక్షపీఠం నుంచి తప్పించడం, తనతో పాటు మరికొందరికీ ఉప ముఖ్యమంత్రి పదవులు ఇప్పించడం ద్వారా డీకేకు చెక్ పెట్టాలనేది సిద్ధరామయ్య వ్యూహమనే ప్రచారం జరుగుతున్నది.

ఎమ్మెల్యేలు, మంత్రులతో విందు

మంత్రి సతీశ్ జార్కిహోళి నివాసంలో గురువారం రాత్రి విందు జరిగింది. ఏడుగురు మంత్రులతో పాటు 20 మంది వరకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఈ సమావేశానికి హాజరయ్యారు. సీఎం సిద్ధరామయ్య సైతం ఈ విందుకు హాజరయ్యారు. నూతన సంవత్సరం సందర్భంగానే ఈ విందు జరిగిందని, రాజకీయాలు చర్చించలేదని మంత్రి హెచ్‌సీ మహదేవప్ప చెప్పారు. ముడా కుంభకోణంలో సిద్ధరామయ్యపై విచారణ నేపథ్యంలో సీఎం పదవిని దక్కించుకునేందుకు డీకే శివకుమార్ ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో శివకుమార్‌కు చెక్ పెట్టే ప్రయత్నమే ఈ సమావేశమనే ప్రచారం జరుగుతున్నది.

ప్రభుత్వం పడిపోవడం ఖాయం: బీజేపీ

కాంగ్రెస్ విందు రాజకీయాలపై బీజేపీ ఎంపీ, మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. 'సీఎంను తప్పించేందుకు డీకే.. డీకేను పదవి నుంచి తప్పించి, ఆయన స్థాయిని తగ్గించేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారు. చివరకు ఈ గొడవ ప్రభుత్వ పతనానికి దారి తీస్తుంది' అని అన్నారు. 'మీరు మీడియాలో కనిపించడానికి పరిమితమా? పార్టీలో అసలు మీ ప్రభావం లేదా? పరిస్థితి ఇలాగే కొనసాగితే సీఎం అవ్వాలనే మీ కలకలగానే మిగిలిపోవడం గ్యారెంటీ' అని డీకేను ఉద్దేశించి ప్రతిపక్ష నేత ఆర్ అశోక వ్యాఖ్యానించారు.

సిద్ధరామయ్య నియోజకవర్గంలో దళిత కుటుంబం వెలి

మైసూరు, జనవరి 3: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న వరుణ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని శ్రీనివాసపుర గ్రామంలో ఓ దళిత కుటుంబంపై గ్రామ పెద్దలు సాంఘిక బహిష్కరణకు ఆదేశించారు. సిద్ధరామయ్య జన్మస్థలం సిద్ధరామనహుండీ గ్రామ సమీపంలోనే శ్రీనివాసపుర ఉండడంతో ఈ వివాదం సంచలనంగా మారింది. పంచాయతీ ఆదేశాలను ఉల్లంఘించామన్న కారణంపై గ్రామ పెద్దలు తమపై సాంఘిక బహిష్కరణ ప్రకటించారని ఆ దళిత కుటుంబం తెలిపింది. పంచాయతీ విధించిన రూ.15,000 జరిమానా చెల్లించేందుకు నిరాకరించిన కారణంగానే తమను సాంఘికంగా బహిష్కరించారని పేర్కొన్నది. గ్రామానికి చెందిన ప్రమోద్, సురేష్ గొడవపడడంతో వారికి గ్రామపెద్దలు జరిమానా విధించారు. దానికి సురేష్ నిరాకరించడంతో కుటుంబాన్ని గ్రామపెద్దలు బహిష్కరించారు.

పేరెంట్స్ ఓకే అంటేనే పిల్లలకు సోషల్ మీడియా

పిల్లల డాటా వినియోగానికి వారి సమ్మతి ఉండాల్సిందే

డాటా ప్రొటెక్షన్ చట్టం ముసాయిదా నిబంధనలు జారీ

న్యూఢిల్లీ, జనవరి 3: ఇక మీదట పిల్లలు సోషల్ మీడియా ఖాతా తెరవాలంటే వారి తల్లిదండ్రుల సమ్మతి అవసరం కానుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకువస్తున్నది. ప్రజల డిజిటల్ డాటా దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు కేంద్రం 2023 ఆగస్టులో డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టాన్ని చేసింది. 16 నెలల తర్వాత ఈ చట్టం అమలుకు అవసరమైన ముసాయిదా నిబంధనలను కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ శుక్రవారం జారీ చేసింది. ఫిబ్రవరి 18వ తేదీ లోపు ముసాయిదా నిబంధనలపై 'మైగవ్.ఇన్' పోర్టల్ ద్వారా అభిప్రాయాలు తెలియజేయాల్సిందిగా సూచించింది. ఇందులో పిల్లల డాటా పరిరక్షణకు కీలక నిబంధనలు ఉన్నాయి. వీటి ప్రకారం.. పిల్లల డాటాను ప్రాసెస్ చేసే ముందు కంపెనీలు తల్లిదండ్రుల సమ్మతిని తీసుకోవాలి. ప్రభుత్వం జారీ చేసిన ఐడీ కార్డులు లేదా డిజిటల్ లాకర్ ద్వారా పిల్లల తల్లిదండ్రులను ధ్రువీకరించుకోవాలి.

డాటా ప్రొటెక్షన్ బోర్డు ఏర్పాటు

డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టం అమలుకు డాటా ప్రొటెక్షన్ బోర్డును ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. డిజిటల్ కార్యాలయంగా ఈ బోర్డు పని చేస్తుంది. చట్ట ఉల్లంఘనలపై విచారణ జరిపే, జరిమానాలు విధించే అధికారాలు ఈ బోర్డుకు ఉంటాయి. గరిష్ఠంగా రూ.250 కోట్ల వరకు జరిమానా విధించవచ్చు. కన్సెంట్ మేనేజర్ల నమోదుకు సంబంధించిన సైతం నిబంధనల్లో పేర్కొన్నది. కన్సెంట్ మేనేజర్లు తప్పకుండా డాటా ప్రొటెక్షన్ బోర్డు వద్ద నమోదు కావాలి. ఇందుకోసం వాటి నికర విలువ కనీసం రూ.12 కోట్లు ఉండాలి.

కేంద్ర ఉద్యోగులపై ఎఫ్ఐఆర్‌కు సీబీఐకి రాష్ట్ర అనుమతి అక్కర్లేదు

తీర్పు చెప్పిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో